క్లుప్తంగా

ఎస్‌ఐ బదిలీ


రంజిత్‌రెడ్డి

నర్సాపూర్: స్థానిక ఎస్‌ఐ లింగం మెదక్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన స్థానంలో మెదక్‌లో ఉన్న రంజిత్‌రెడ్డి నర్సాపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. అత్యవసర సమయాల్లో నంబర్.100కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీ సమావేశం


విద్యార్థుల ప్రగతిని వివరిస్తున్న లెక్చరర్ నర్సింహులు

చేగుంట(తూప్రాన్): విద్యార్థులను ఇళ్లల్లోనూ చదివిస్తే మెరుగైన మార్కులు వస్తాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిరోజు కళాశాలకు పంపించడంతోపాటు ఇంటివద్ద చదివించాలన్నారు. అనంతరం పలు సబ్జెక్టులకు సంబంధించిన లెక్చరర్లు విద్యార్థుల ప్రగతికి సంబంధించిన వివరాలను తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు నర్సింహులు, వెంకటేశ్వర్లు, స్వర్ణలత, ప్రమోద్, లక్ష్మణ్, రాధిక, రంజిత్, అరవింద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంజీరా వైపు వెళ్లొద్దు


మంజీరా ప్రాంతంలో విధుల్లో పోలీసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): భారీ వర్షాల నేపథ్యంలో సింగూర్ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కారణంగా మంజీరా ఉధృతి తీవ్రంగా ఉందని ఎస్‌ఐ నర్సింలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిట్కుల్ శివారులో ఉన్న పాత వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు, చాముండేశ్వరి ఆలయానికి వచ్చే భక్తులు నది తీరం వైపు వెళ్లొద్దన్నారు. అలాగే సెల్ఫీలు, రీల్స్ అంటూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నర్సింలు, సతీష్, దేవీసింగ్, చైతన్య పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణ


వ్యర్థాల శాంపిల్స్ సేకరించిన పీసీబీ సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా పలు కెమికల్ పరిశ్రమల యజమానులు వ్యర్థాలు బయటకు వదులుతున్నారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని నవాబుపేట గ్రామ పరిధిలో ఉన్న పలు కెమికల్ పరిశ్రమల నుంచి వ్యర్థాలు బయటకు వదులుతుండడంతో చెరువు నీరు కలుషితమవుతోంది. అంతేకాకుండా పంటల్లోకి వ్యర్థాలు చేరడంతో పలువురు రైతులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం పీసీబీ అధికారులు నవాబుపేట గ్రామ పరిధిలో వ్యర్థ రసాయన శాంపిల్స్‌ని సేకరించారు.

పిడుగుపడి రైస్‌మిల్‌లో మంటలు


మంటలను ఆర్పుతున్న తండావాసులు

కొడిపల్లి(నర్సాపూర్): పిడుగుపడటంతో రైస్‌మిల్‌లో మంటలు అంటుకున్నాయి. దీంతో విద్యుత్ వైర్లతో పాటు పలు ధాన్యం బస్తాలు దగ్ధం అయ్యాయి. ఈసంఘటన మండలంలోని ధర్మాసాగర్‌గేట్‌తండా వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. తండా సమీపంలో కొడిపల్లి మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి రైస్‌మిల్ ఉంది. కాగా రాత్రి రైస్‌మిల్ పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడింది. దీంతో రైస్‌మిల్‌లో షాట్‌సర్క్యూట్ అయి విద్యుత్ పరికరాలకు మంటలు అంటుకున్నాయి. గమనించిన తండావాసులు రైస్‌మిల్ యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పారు. అనంతరం తండావాసులు మంటలను ఆర్పారు.


శివ్వంపేట: కొలువైన దుర్గామాత


కొల్చారం: చిన్నఘనాపూర్‌లో పూజలందుకుంటున్న అమ్మవారు


నర్సాపూర్: మహాలక్ష్మీ దేవిగా దర్శనమిస్తున్న శీతల మాత


హవేళిఘణాపూర్: సర్ధనలో పూజలందుకుంటున్న అమ్మవారు

శక్తి స్వరూపిణి నమోస్తుతే

జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రతిరోజూ ఒక్కో రూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఐదో రోజు అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


మనోహరాబాద్: కూచారంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు


నిజాంపేట: మహాలక్ష్మీ అమ్మవారిగా దుర్గామాత


చిలప్‌చెడ్: అజ్జమర్రిలో దుర్గామాతకు బోనాలు


టేక్మాల్: అచ్చన్నపల్లిలో పూజలందుకుంటున్న దుర్గామాత


తూప్రాన్: అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు


పెద్దశంకరంపేట: అమ్మవారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


హవేళిఘణాపూర్: విద్యుద్దీపాల కాంతులతో పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు


కొడిపల్లి: రాయిలాపూర్‌లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు


కొర్విపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

చిన్నశంకరంపేట(మెదక్): దుర్గామాత ఆశీస్సులతో స్థానిక నియోజవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కొర్విపల్లిలో వెలసిన దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, రాజిరెడ్డి, యాదవరావు, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

పాపన్నపేట(మెదక్): పెట్రోల్ బంకు యజమానులు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాపన్నపేటలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బంకు యజమానులు రాజశేఖర్, మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంతప్ప, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషాచారి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శేషాచారి

నర్సాపూర్ రూరల్: విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషాచారి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు స్నేహం చేయకుండా లక్ష్యంతో చదువుకోవాలన్నారు. డ్రగ్స్, మత్తు పానీయాలకు దూరంగా ఉండి ఎలాంటి వ్యసనాలకు లోను కాకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు జోత్స్న దేవి, నాగరాజు, రామ్ రెడ్డి, హరీష్, భాగ్యలక్ష్మి, అనిల్, కళింగ రెడ్డి, రమాదేవి, అతిక్ ఫాతిమా, అభినవ్, రాజేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొప్ప మనసు చాటుకున్న మాజీ ఎమ్మెల్యే

- రెండేళ్లపాటు కిరాయి లేకుండా కళాశాలకు సొంతభవనం
- మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): పట్టణంలోని డిగ్రీ కళాశాలకు రెండేళ్లపాటు కిరాయి లేకుండా సొంతభవనం ఇస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన డిగ్రీ కళాశాల నర్సాపూర్‌లో కొనసాగుతుందన్నారు. అయితే కొడిపల్లిలోని తన సొంతభవనం రెండేళ్లపాటు కిరాయి లేకుండా డిగ్రీ కళాశాలకు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థులు నర్సాపూర్ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రెండు నెలల క్రితం ఉన్నత విద్యాశాఖకు లేఖ రాయగా ప్రస్తుతం అనుమతి మంజూరైనట్లు చెప్పారు. ప్రస్తుతం నర్సాపూర్‌లో కొనసాగుతున్న డిగ్రీ కళాశాల దసరా ముగిసిన అనంతరం ఇక్కడే ప్రారంభించనున్నట్లు వివరించారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో సొంతభవనం నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. దీంతోపాటు నూతనంగా నిర్మిస్తున్న సీహెచ్‌సీని త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గోవర్ధన్‌రెడ్డి, రాజుయాదవ్, వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, నాయకులు కృష్ణాగౌడ్, దుర్గాగౌడ్, శాఖయ్య, శెట్టయ్య, మోతిలాల్‌గౌడ్, పుండరీకం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు అందించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం


మాట్లాడుతున్న మల్లేశం

చిన్నశంకరంపేట(మెదక్): అసంఘటిత కార్మికులకు కనీస వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో అసంఘటిత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిందిస్థాయి ఉద్యోగులతో వెట్టిచాకిరి చేయించుకునే శ్రద్ధ వేతనాలు అందించడంలో పెట్టడం లేదన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, ఐకేపీ వీఓలు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు కీలక సేవలు అందిస్తున్నా ప్రభుత్వం వేతనాలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అసంఘటిత కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాములు, సత్యనారాయణ, రాజు, యాదమ్మ, ఆశ యూనియన్ నాయకులు రేణుక, విద్యుత్ కార్మిక సంఘం నాయకులు నర్సింహులు, ఈజీఎస్ ఎఫ్ఏల సంఘం నాయకులు నర్సింహులు ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

నర్సాపూర్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు డ్రా పద్ధతిలో తమ సంస్థ బహుమతులు అందించనున్నట్లు డిపో మేనేజర్ సురేఖ చెప్పారు. ఈనెల 27నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు మెదక్ నుంచి సికింద్రాబాద్ మార్గంలో ఆర్టీసీకి చెందిన డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారికి అవకాశం ఉంటుందన్నారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణం ముగిసిన అనంతరం వారి టికెట్ వెనకాల అడ్రస్ రాసి జేబీఎస్, మెదక్, నర్సాపూర్ బస్టాండ్‌లలో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్సుల్లో టికెట్లు వేయాలని ఆమె సూచించారు. ఆ తర్వాత ఇందులోని టికెట్లను డ్రా తీసి మొదటి బహుమతిగా రూ.25వేలు, రెండవ బహుమతిగా రూ.15వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలు అందజేయనున్నట్లు ఆమె చెప్పారు.

కుండపోత వర్షం

- అలుగు పారుతున్న చెరువులు, కుంటలు
- పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం


అలుగులు పారుతున్న రాయరావు చెరువు


టేక్మాల్: ఎలకుర్తి–కోరంపల్లి రోడ్డు..

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలో 65.6మిల్లీ మీటర్ల కుండపోత వర్షం నమోదైంది. దీం కొడిపల్లి, రాయిలాపూర్, మహమ్మద్‌నగర్, రాజిపేట, సదాశివపల్లి తదితర గ్రామాలలోని పెద్ద చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి.

నిలిచిన రాకపోకలు

టేక్మాల్(మెదక్): మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గుండువాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో టేక్మాల్–జోగిపేట, ఎలకుర్తి–కోరంపల్లి ప్రధాన రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

భారీ వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలలో నీరు సమృద్ధిగా చేరి అలుగులు ప్రవహిస్తున్నాయి. అయితే ఈ వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతరాయం..

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కురిసిన వర్షాలతో చెరువు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. గంగమ్మవాగు ఉధృతి పెరగడంతో దూప్‌సింగ్ తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మెదక్ మండలంలోని కొంటూర్ చెరువు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

చెరువులకు జలకళ

నర్సాపూర్: మండలంలో 74 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు రాయరావు చెరువు మళ్లీ అలుగు పారింది. దీంతో పాటు ఆయా గ్రామాల చెరువులు సైతం అలుగులు పారుతున్నాయి.

‘స్థానిక’ విధుల్లో అవకాశం కల్పించాలి


అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో సీనియర్ టీచర్లకు అవకాశం ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ల శ్రీనివాస్, సామ్యనాయక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్ నగేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఎన్నికల శిక్షణకు హాజరుకాని టీచర్లకు దసరా సెలవుల అనంతరం మరోసారి శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో సీనియర్ టీచర్లకు అవకాశం కల్పించాలన్నారు. దివ్యాంగులకు, మెడికల్ గ్రౌండ్‌లో ఉన్న టీచర్లకు ఎలక్షన్ విధుల నుంచి మినహాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు సుంకరి కృష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంకటరామ్ రెడ్డి, మల్లారెడ్డి, మహేష్, సతీష్ రావు, పంతులు రాజు, అమీరుద్దీన్, సహదేవ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల


అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎల్లుపేట అంగన్‌వాడీలో పోషకాహార మాసోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరిత, పంచాయతీ కార్యదర్శి మహేష్ కుమార్, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశావర్కర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్లకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్, టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వెంకటేష్, ప్రభుత్వ వైద్యులు వంశీ చారి, ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ..

బతుకమ్మ పండుగ సందర్భంగా పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మ ఆటాపాటలతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


చేగుంట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో కళాశాల సిబ్బంది


శివ్వంపేట: జూనియర్ కాలేజీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


పెద్దశంకరంపేట జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె జీవితం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ సాధన కోసం ఐలమ్మ చేసిన కృషిని కొనియాడారు. ఆమె ఆశయసాధనకు కృషి చేయాలని సూచించారు.


పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్


పెద్దశంకరంపేటలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


చేగుంటలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం సభ్యులు


నిజాంపేటలో..


నర్సాపూర్‌లో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఆయా పార్టీల నాయకులు


రామాయంపేటలో నివాళులర్పిస్తున్న రజక సంఘం, కాంగ్రెస్ కార్యకర్తలు


మాసాయిపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు